సాక్షి నంద్యాల

శనివారం । 17 । జూన్ । 2023



21 వరకు చిరు జల్లులు

ఎమ్మిగనూరురూరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో 21వ తేదీ వరకు చిరు జల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త మహదేవయ్య తెలిపారు.



ఉర్దూ వర్సిటీకి మహర్దశ

డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. భూసేకరణ రుసుం సమస్యను ఇటీవలే పరిష్కరించింది.

8లో▸



శాస్త్రోక్తంగా ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.

న్యూస్‌రీల్

మల్లన్న హుండీ ఆదాయం రూ.4.03 కోట్లు



భక్తులు సమర్పించిన కానుకలు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది, శివసేవకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఉభయ దేవాలయాల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూపేణా రూ.4,03,29,226 లభించినట్లు దేవస్థాన ఈఓ ఎస్.లవన్న తెలిపారు. శుక్రవారం ఆలయంలోని అలంకార మండపంలో 27 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. నగదుతో పాటు బంగారం 521.700 గ్రాములు, వెండి 6.130 కిలోలు లభించాయి. అలాగే యూఎస్‌ఏ డాలర్లు 3740, కువైట్ దినార్లు-10, సింగపూర్ డాలర్లు-30, యూఏఈ దిర్హమ్స్-15, ఆస్ట్రేలియా డాలర్లు-70, మలేషియా రింగిట్స్-15, యూరోలు-60 మొదలైన విదేశీ కరెన్సీ భక్తులు సమర్పించినట్లు ఈఓ తెలిపారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో లెక్కింపు చేపట్టారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎస్పీ రఘువీర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో భాగంగా సిబ్బంది ఎస్పీ నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను అధిగమించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వెంకటరాముడు, స్పెషల్ బ్రాంచ్ సీఐ దస్తగిరి బాబు, నాగరాజు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం



దాతకు విరాళాల బాండ్‌ను అందజేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్:భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం చిత్తూరుకు చెందిన జి.వరలక్ష్మమ్మ కుటుంబ సమేతంగా రూ.1,00,011 విరాళాన్ని అందించారు. దాతకు స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను అందజేసి సత్కరించారు.

రాహుకేతు పూజలు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో మాసశివరాత్రి సందర్భంగా శుక్రవారం పలు ప్రాంతాలకు చెందిన భక్తులు రాహుకేతు పూజల్లో పాల్గొన్నారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు శరభయ్యశర్మలు విశేష పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు పండితులు స్వామి, అమ్మవార్ల ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

- నందికొట్కూరు ప్రభుత్వ కాలేజీకి వెళ్లే దారిలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఫీజు పేరుతో దండుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నాలుగో తరగతికి స్కూలు ఫీజు రూ.18,000, స్పెషల్ ఫీజు రూ.2,000, పుస్తకాలకు రూ.5,430 వసూలు చేస్తున్నారు. వ్యాను ఫీజు రూ.10,000 అదనం.
- నంద్యాల రోడ్డులోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి పుస్తకాలు, వ్యాను ఫీజు, డ్రస్సుకు రూ.23,000 వసూలు చేస్తున్నారు. అదే 3వ తరగతికి అయితే రూ.21,000 చెల్లించాలంటున్నారు. ఇంత ఫీజు ఎందుకు అని పిల్లల తల్లిదండ్రులు గట్టిగా నిలదీస్తే సీటు లేదని బెదిరిస్తున్నారు.
- మిడ్తూరు రోడ్డులోని బసిరెడ్డి కళాశాల వెనుక ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఫస్టు క్లాసుకు ఫీజు రూ.18,500గా నిర్ణయించారు. దీంతో పాటు పుస్తకాలు రూ.5,400, వ్యాను ఫీజు రూ.10,000 ప్రకారం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారు.

ఈ ఫీ'జులుం'.. ఒక నందికొట్కూరు పట్టణంలోనే కాదు.. జిల్లాలోని ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఇదే పరిస్థితి. ఫీజు, పాఠ్యపుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారు.


చదువు కొనాల్సిందే!

ఫీజు పేరుతో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల దోపిడీ

- తరగతిని బట్టి పుస్తకాలకు రూ. 5 వేల నుంచి రూ.10వేలకు పైగా వసూలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- అమలుకు నోచుకోని ప్రభుత్వ నిబంధనలు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖాధికారులు

తరగతి, ప్రాంతాల వారీగా ప్రభుత్వం నిర్ణయించి జారీ చేసిన ఫీజు వివరాలు ఇలా..

స్కూలు ఉన్న ప్రాంతం	ప్రైమరీ తరగతులు (నర్సరీ–5వరకు)	సెకండరీ తరగతులు (6–10 తరగతులు)
గ్రామ పంచాయతీ	రూ.10,000	రూ.12,000
మున్సిపాలిటీ	రూ.11,000	రూ.15,000
కార్పొరేషన్	రూ.12,000	రూ.18,000



తెల్లకాగితంపై నాలుగో తరగతి ఫీజు వివరాలు రాసిచ్చిన దృశ్యం

జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో సమూలమైన మార్పులు తీసుకొచ్చారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా వసూళ్లు చేస్తున్న ఫీజును కట్టడి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. మండల, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలోని ప్రైవేటు పాఠశాలలకు ఫీజు నిర్ణయించారు. ఆ మేరకే వసూలు చేయాలని ఉత్తర్వులు సైతం జారీ చేశారు. అయితే, పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ ఆదేశాలను పాటించడం లేదు. పిల్లలకు మంచి విద్యను అందిచాలనే తల్లిదండ్రుల ఆసక్తిని ప్రైవేట్ విద్యాసంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుపై రెండు, మూడింతలు అధికంగా వసూళ్లు చేస్తున్నాయి.

పాఠ్యపుస్తకాల పేరుతో దోపిడీ

నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు, పగిడ్యాల, పాములపాడు, కొత్తపల్లి, జూపాడుబంగ్లా, మిడ్తూరు మండలాల పరిధిలో 36 ప్రైవేటు పాఠశాలలున్నాయి. వాటిల్లో 12,950 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అందరికీ విద్యలో భాగంగా ప్రభుత్వం ప్రైవేట్ విద్యా సంస్థలకు నామమాత్రపు ఫీజుతో పాఠ్యపుస్తకాలు అందజేస్తుంది. అయితే, ఆ విద్యా సంస్థలు సొంతంగా పుస్తకాలను ముద్రించి విక్రయిస్తున్నారు. 1 నుంచి 5వ తరగతి పుస్తకాలకు రూ.4,900 నుంచి రూ.7,500 వరకు వసూలు చేస్తున్నారు. అదే 6 నుంచి 10తరగతి పుస్తకాలకు అయితే రూ.8,000 నుంచి రూ.10,200 దాకా దండుకుంటున్నారు.



ఒక్కో పాఠశాలకు ఒక్కో ఫీజు

నందికొట్కూరు పట్టణంలో పేరుగాంచిన కార్పొరేట్ పాఠశాలలతో పాటు పలు ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఇందులో ఏ ఒక్క పాఠశాల కూడా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు వసూలు చేయడం లేదు. ప్రతి పాఠశాల సొంతంగా ఫీజు నిర్ణయించి వసూలు చేస్తున్నాయి. కార్పొరేట్ స్కూళ్లల్లో తరగతిని బట్టి 1 నుంచి 5 వరకు రూ. 23 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఆపై తరగతులకు రూ. 30 వేల వరకు దండుకుంటున్నాయి. ఇందులో వ్యాన్, పుస్తకాల ఫీజు అదనం. అయితే, ఈ ఫీజు వివరాలు ఏ ఒక్క పాఠశాల కూడా నోటీసు బోర్డులో పెట్టకపోవడం గమనార్హం.

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించరాదు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల కంటే అధికంగా ఫీజు వసూళ్లు చేయరాదు. అయితే, ఇది ఎక్కడా అమలు కావడం లేదు. ఈ విషయం తెలిసి కూడా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా పక్కాగా ప్రభుత్వ నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇద్దరు పిల్లలకు ఏడాదికి రూ.50 వేలు



నేను బుక్‌కీపర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. నాకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. నందికొట్కూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించాను. 3వ తరగతికి రూ.21వేలు, 5 తరగతికి రూ.23 వేల చొప్పున ఫీజులు చెల్లించాలన్నారు. ఫీజులకే రూ. 50 వేలు ఖర్చు అయితే పిల్లల మిగతా ఖర్చులు, కుటుంబ పోషణ ఎలా గడపాలో తెలియడం లేదు.

– గోపాల్, విద్యార్థుల తండ్రి

ఫిర్యాదు చేస్తే చర్యలు



నందికొట్కూరు పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ధరలకు పుస్తకాలు విక్రయిస్తున్నట్లు, అధికంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. రెండు రోజుల క్రితం నారాయణ పాఠశాలపై దాడి చేసి వారు సొంతంగా తయారు చేసి విక్రయిస్తున్న పుస్తకాలను సీజ్ చేశాం.

– ఫైజున్నిసా, మండల విద్యాధికారి, నందికొట్కూరు

బేతంచెర్ల పాలిటెక్నిక్ కళాశాలకు ఏఐసీటీఈ అనుమతి



ఏఐసీటీఈ అనుమతి పత్రాలతో కళాశాల ఓఎస్డీ రాజేష్, ఎంపీపీ బుగ్గన నాగభూషణం తదితరులు

బేతంచెర్ల: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలకు ఏఐసీటీఈ అనుమతి వచ్చినట్లు ఆ కళాశాల ఓఎస్డీ రాజేష్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఏఐసీటీఈ అనుమతి పత్రాలను ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి తదితరుల తో కలసి ఓఎస్డీ రాజేష్ మీడియాకు చూపించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతోనే మండలానికి పాలిటెక్నిక్ కళాశాల మంజూరైందన్నారు. నాలుగు బ్రాంచ్‌లకు అనుమతి లభించినట్లు తెలిపారు. అడ్మిషన్లకు అన్ని కళాశాలతో పాటు వెబ్ ఆప్షన్లు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బేతంచెర్ల కళాశాలలో అత్యాధునిక కోర్సు అయిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్సులకు ఏఐసీటీఈ న్యూఢిల్లీ అనుమతి ఇచ్చిందన్నారు. ఒకొక్క కోర్సులో 60 సీట్లతో పాటు పది శాతం ఈడబ్ల్యూఎస్ సీట్లతో భర్తీ చేయడం జరుగుతుందన్నారు.

26 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): ఏపీ ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని డీఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్ష జరుగుతాయన్నారు. జూన్ 26 నుంచి జూలై 4వ తేదీ వరకు పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయన్నారు. అలాగే ఇంటర్ ప్రాక్టికల్స్ జూలై 5 నుంచి 7వ తేదీ వరకు జరుగుతాయని డీఈఓ వివరించారు.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్.సి ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై రేపు ఉచిత అవగాహన సదస్సు

- ఆదివారం ఉదయం 09:00 నుంచి 12:30 వరకు
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

అవగాహన సదస్సు తేదీ:
జూన్ 18, 2023 (ఆదివారం)

వేదిక:
బీఏఎస్ కల్యాణమండపం, ఎస్‌వీ. కాంప్లెక్స్ ఎదురుగా, ఆర్‌ఎస్ రోడ్, కర్నూలు.

సమయం:
ఉదయం 09:00 నుంచి 12:30 వరకు

కర్నూలు: ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్(www.sakshieducation.com) రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్ కలిసి జూన్ 18వ తేదీ(ఆదివారం) ఉదయం 09:00 నుంచి 12:30 వరకు కర్నూలులోని BAS.Kalyanamandapam,Opp.S.V.Complex, R.S.Road నందు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే. టాలెంట్ టెస్ట్ కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

నేడు జిల్లా స్థాయి ఆణిముత్యాల పురస్కారం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో శనివారం ఉదయం జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాల పురస్కారం ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రులు అంజాద్‌బాషా, బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, హెచ్‌ఎంలు హాజరుకావాలన్నారు.

- ఖరీఫ్‌లో విత్తనానికి ముందే పంటకు మద్దతు ధర
- 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర కేటాయింపు
- క్వింటాపై కనిష్టంగా రూ.143, గరిష్టంగా రూ.803 పెరుగుదల
- చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం
- ధరలను అంచనా వేసుకొని పంటలు సాగు చేసే అవకాశం



శనగలను మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

సేద్యానికి భరోసానిచ్చి.. పంటకు మద్దతునిచ్చి!

కోవెలకుంట్ల: వ్యవసాయాన్ని జీవనాధారం చేసుకున్న రైతుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పగటి వేళలోనే తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్‌సరఫరా, రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరా, ఏటా వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఆర్థిక సాయం, రూ. 3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, అతివృష్టి, అనావృష్టి సంభవించి పంట నష్టం జరిగితే ఇన్‌పుట్ సబ్సిడీ అందజేసేందుకు రూ. 2వేల కోట్ల పకృతి వైపరీత్యాల నిధి ఏర్పాటు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర పథకాలతో రైతులకు అండగా నిలుస్తోంది. ఈ క్రమంలో 2023-24 పంట సంవత్సరానికి సంబంధించి కేంద్రం ఇటీవలే వివిధ రకాల పంటలకు మద్దతు ధర ప్రకటించడంతో రైతులు ధైర్యంగా పంటలు సాగు చేస్తున్నారు.

ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగా విత్తనానికి ముందే 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించింది. పంటల సాగులో రైతులు పెట్టిన పెట్టుబడిలో 50 శాతం లాభం పొందాలనే ప్రాతిపదికన కనీస మద్దతు ధర నిర్ణయిస్తారు. ఆయా సీజన్లలో పండించే పంటల్లో 23 పంటలకు మాత్రమే కనీస మద్దతు ధర వర్తిస్తుంది. తృణ ధాన్యాల పంటలైన వరి, గోధుమ, సజ్జ, మొక్కజొన్న, జొన్న, రాగి, బార్లీ, పప్పుధాన్యాల పంటలైన శనగ, కంది, పెసర, మినుము, పెసర, తదితర పంటలకు ఈ ఏడాది పెంచిన మద్దతు ధరలను ప్రకటించింది. ప్రభుత్వ ఏజెన్సీలైన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటి ఏజెన్సీలు రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాయి. ఒకవేళ మార్కెట్‌లో ధరలు పడిపోయినా మద్దతు ధర ప్రకటించడం వల్ల ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా దిగుబడులను విక్రయిస్తుంది. దీనివల్ల రైతులకు నష్టం వాటిల్లదు. ఎంఎస్‌పీ విధానం రైతులకు అన్ని విధాలా మేలు చేస్తోంది.

గతేడాది మద్దతు ధరలు, ప్రస్తుతం సవరణ, పెరుగుదల వివరాలు (క్వింటాకు రూ.ల్లో)

పంట	2022–23	2023–24	పెరుగుదల
పత్తి(పొడుగురకం)	6,380	7,020	640
పత్తి (మధ్యరకం)	6,080	6,620	540
వరి(గ్రేడ్–ఏ)	2,060	2,203	143
వరి (కామన్ రకం)	2,040	2,183	143
జొన్న హైబ్రిడ్	2,970	3,180	210
జొన్న(మాల్దండి)	2,990	3,225	235
సజ్జ	2,350	2,500	150
రాగులు	3,578	3,846	268
మొక్కజొన్న	1,962	2,090	128
కంది	6,600	7,000	400
పెసర	7,755	8,558	803
మినుము	6,600	6,950	350
వేరుశనగ	5,850	6,377	527
పొద్దుతిరుగుడు	6,395	6,760	365
సోయాబీన్	4,300	4,600	300
నువ్వులు	7,830	8,635	805

తృణ ధాన్య పంటల సాగుపై ఆసక్తి

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు తృణ ధాన్య పంటల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. 67,890 హెక్టార్లలో వరి, 39,035 హెక్టార్లలో మొక్కజొన్న, 39,131 హెక్టార్లలో కంది, 7,884 హెక్టార్లలో మినుము, 7,012 హెక్టార్లలో మిరప, 22,410 హెక్టార్లలో పత్తి, 17,397 హెక్టార్లలో వేరుశనగ, 3,058 హెక్టార్లలో జొన్న, 6,646 హెక్టార్లలో కూరగాయల పంటలు సాగు లక్ష్యం కాగా సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తన పనుల్లో నిమగ్నమయ్యారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది నువ్వుల పంటకు రూ. 805, పెసరకు రూ. 803, పత్తికి రూ. 640, వేరుశనగకు రూ. 517, మినుముకు రూ. 350, కందికి రూ. 400 మద్దతు ధర పెంచడంతో ఈ ఏడాది ఆయా పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే ఆస్కారం ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ముందే ప్రకటించడం హర్షణీయం



ప్రభుత్వం ఈ ఏడాది మద్దతు ధర పెంచి విత్తనానికి ముందే వివిధ పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. నాకున్న ఐదు ఎకరాల్లో ఏటా పప్పుశనగ, జొన్న పంటలు సాగు చేస్తున్నాను. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వివిధ పంటలకు ప్రభుత్వం మద్దతు ధర పెంచడం హర్షణీయం.

– లక్ష్మీనారాయణ, రైతు, కలుగొట్ల, కోవెలకుంట్ల మండలం

దళారుల దోపిడీకి అడ్డుకట్ట



ప్రభుత్వం వివిధ పంటలకు మద్దతు ధర ప్రకటించడంతో దళారుల దోపిడీకి అడ్డుకట్ట పడింది. వివిధ పంటలు సాగు చేసి అష్టకష్టాలు పడి దిగుబడులు సాధిస్తే మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకుంటే దళారుల చేతిలో పెట్టాల్సి వచ్చేది. విత్తనానికి ముందే మద్దతు ధర నిర్ణయించడంతో దళారుల ప్రమేయం ఉండదు.

– ప్రతాప్‌రెడ్డి, రైతు, కోవెలకుంట్ల

మద్దతు ధరతో దిగుబడులు అమ్ముకోవచ్చు



ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పండించే వివిధ పంటల దిగుబడులను మద్దతు ధరతో అమ్ముకునేందుకు అవకాశం ఉంటుంది. వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 21,329 హెక్టార్లలో పంటల సాగు సాధారణ విస్తీర్ణం. ప్రభుత్వం విత్తనానికి ముందే మద్దతు ధర ప్రకటించి రైతుల్లో ఉత్సాహం నింపింది.

– నిరంజన్, ఇన్‌చార్జ్ ఏడీఏ, కోవెలకుంట్ల

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోండి

- నకిలీ విత్తన మాఫియాను అరికట్టండి
- ఫర్టిలైజర్స్ దుకాణాలపై ఆకస్మిక దాడులు చేయండి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



సమావేశానికి హాజరైన అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ చిత్రంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జేసీ నిశాంతి

నంద్యాల: జిల్లాలో మైనింగ్, రేషన్ బియ్యం అక్రమ రవాణా, నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ అంశాలపై పోలీసులు, పలు శాఖల అధికారులతో కో–ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి, డీఆర్‌ఓ పుల్ల య్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్రమ మైనింగ్, రేషన్ బియ్యం రవాణా, నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాల నియంత్రణకు టాస్క్ ఫోర్స్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించాలన్నారు. అక్ర మాలకు పాల్పడిన వ్యక్తులపై పీడీ యాక్ట్ అమలు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఇరిగేషన్, మైనింగ్, సివిల్ సప్లయ్, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి కమిటీ లు ఏర్పాటై గుర్తించిన బ్లాక్ స్పాట్లలో ఆకస్మిక తనిఖీ లు నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, మండల స్థాయి బృందాల్లో రెవెన్యూ, పోలీసు, సంబంధిత అధికారులు ప్రతి రోజు గుర్తించిన బ్లాక్ స్పాట్లలో చురుకుగా పనిచేసి పైస్థాయి అధికారులకు సమాచా రం ఇచ్చేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని వచ్చే రెండు నెలలు కీలకంగా వ్యవహరించి చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారుల ను ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో మీడియాను కూడా భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి మాట్లాడు తూ అక్రమ రవాణా, రైతాంగం నష్టపోకుండా తీసుకోవాల్సిన అంశాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. టాస్క్ ఫోర్స్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తూ సీరియస్ యాక్షన్ తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు ముందుకొచ్చి పోలీసులకు సమాచారమిచ్చి సహకరించాలని కోరారు.

అర్హత కలిగిన ప్రతి రైతుకూ సూక్ష్మ సేద్యం

• ఏపీఎంఐపీ ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న ఏపీఎంఐపీ ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు

కర్నూలు(అగ్రికల్చర్): తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసేందుకు సూక్ష్మ సేద్యం ఎంతో ఉపయోగపడుతోందని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు అన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతు సూక్ష్మ సేద్యం పొందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ వెనుక ఉన్న ఉద్యాన భవన్‌లో కర్నూలు, నంద్యాల జిల్లాల ఎంఐ, కంపెనీల ఇంజినీర్లు, ఇతర సిబ్బందికి సూక్ష్మ సేద్యం మార్గదర్శకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. డ్రిప్, స్ప్రింకర్ల మంజూరుకు సంబంధించి సబ్సిడీలపై రైతులకు పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. రైతులకు నాణ్యమైన పరికరాలు, మెటీరియల్ సరఫరా చేయాలని సూచించారు. ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి మాట్లాడుతూ... ఈ ఏడాది 5 వేల హెక్టార్లకు సూక్ష్మ సేద్యం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు పీడీ రాజాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ యూనివర్సిటీకి మహర్దశ

- భూ సేకరణ రుసుం మాఫీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రూ.49 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదన
- త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం
- మెరుగు పడనున్న మౌలిక వసతులు


నిర్మాణంలో ఉన్న వర్సిటీ భవనం


అద్దె భవనంలో ఉన్న ఉర్దూ యూనివర్సిటీ

కర్నూలు(న్యూసిటీ): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. భూసేకరణ రుసుం సమస్యను ఇటీవలే పరిష్కరించింది. త్వరలోనే వర్సిటీలో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ హయాంలో వర్సిటీ కోసం ఓర్వకల్లులో 144.34 ఎకరాలను కేటాయించారు. భూ సేకరణకు ప్రభుత్వ మార్కెట్ ధర ఆధారంగా రెవెన్యూ శాఖకు వర్సిటీ రూ.7.20 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఎటువంటి ఆదాయ వనరులు లేని ఒదున వర్సిటీ అధికారులు సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. భూ సేకరణ రుసుం నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రతిపాదించడంతో సీఎం సానుకూలంగా స్పందించి జీఓ నం 785ను విడుదల చేసి.. భూ సేకరణ రుసుంను మాఫీ చేయాలని రెవెన్యూ శాఖకు ఉత్తర్వులు జారీ చేశారు.

నిధుల మంజూరుకు ప్రతిపాదన

వర్సిటీకి సొంత భవనాల నిర్మాణాల కోసం ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) ద్వారా ప్రతిపాదించిన రూ.49 కోట్లు నిధులు మంజూరుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే నిధులు వస్తాయని అధ్యాపకులు చెబుతున్నారు. ప్రస్తుతం యూనివర్సిటీ కోసం ఓర్వకల్లులో కేటాయించిన స్థలంలో కొంత వరకు భవన నిర్మాణ పనులు జరిగాయి. రోడ్ల పనులు నిధులు లేక అర్ధంతరంగా ఆగిపోయాయి. వర్సిటీకి రూ.49 కోట్లు నిధులు మంజూరైతే ఈ పనులన్నీ పూర్తి కానున్నాయి. అద్దె భవనం నుంచి సొంత భవనంలోకి వర్సిటీ మారేందుకు అవకాశం ఉంటుంది.

వర్సిటీ ప్రస్థావన ఇదీ..

రాష్ట్రంలో అత్యధిక ముస్లిం జనాభా కలిగిన జిల్లాగా కర్నూలుకు గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో ఏపీ స్టేట్ లెజిస్లేచర్ యాక్ట్ - 2016 ప్రకారం కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీని అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉర్దూ భాషా అభివృద్ధికి సేవలందించిన ఉస్మానియా విద్యాలయ వ్యవస్థాపకులు డాక్టర్ అబ్దుల్ హక్ స్మారకంగా ఆయన పేరుతోనే వర్సిటీని ఏర్పాటు చేశారు. ఉర్దూ, ఇంగ్లిష్ భాషలలో బోధనను అమలు చేస్తూ ఈ విశ్వవిద్యాలయం ముందుగు సాగుతోంది. 76 మందితో ప్రారంభమైన వర్సిటీలో ప్రస్తుతం 500 మందికిపై విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ చదివే విద్యార్థులకు జగనన్న విద్యా దీవెనె, జగనన్న వసతి దీవెన అందుతోంది.

సీఎం సానుకూలంగా స్పందించారు



ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటుకు ఓర్వకల్లు వద్ద 2016లో అప్పటి ప్రభుత్వం 144.34 ఎకరాలను కేటాయించింది. ఆ స్థలానికి సంబంధించి రూ.7.20 కోట్లు చెల్లించాలని రెవెన్యూ శాఖకు యూనివర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించి భూ సేకరణ రుసుంను మాఫీ చేయాలని రెవెన్యూ శాఖకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే భవనాలు, రోడ్ల నిర్మాణాలు, మౌలిక వసతుల కోసం ఏపీఈడబ్ల్యూఐడీసీ ప్రతిపాదించిన రూ.49 కోట్లు విడుదల చేయాలని విన్నవించడంతో సుముఖత వ్యక్తం చేశారు.

– ఫజుర్ రహమన్, వైస్ చాన్స్‌లర్, ఉర్దూ విశ్వవిద్యాలయం

శుభపరిణామం



ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రారంభమైనప్పటి నుంచి సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఏపీఈడబ్ల్యూఐడీసీ ప్రతిపాదించిన రూ.49 కోట్లు ప్రభుత్వం మంజూరు చేస్తే బాగుంటుంది. ఇప్పటికే యూనివర్సిటీకి ఆదాయ వనరులు లేకపోవడంతో నిర్వాహణ చాలా కష్టంగా ఉంది. ఈ సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 144.34 ఎకరాలకు సంబంధించిన రుసుంను మాఫీ చేయడం శుభపరిణామం.

– బాయినేని శ్రీనివాసులు, రిజిస్ట్రార్, ఉర్దూ విశ్వవిద్యాలయం

చాలా సంతోషం



వర్సిటీ కోసం కేటాయించిన భూమికి డబ్బులు చెల్లించాలని గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా ఏర్పడిన వర్సిటీకి ఆదాయ వనరులు లేకపోవడంతో వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్, అధికారులు కలిసి సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సీఎం భూ సేకరణ రుసుంను మాఫీ చేస్తున్నట్లు హామీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది.

– సతీష్‌కుమార్, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, రెండోసంవత్సరం

హర్షణీయం



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారు. విద్యార్థుల కోసం అమ్మఒడి, విద్యా కానుక, విద్యా దీవెన తదితర పథకాలు పెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారు. భూ సేకరణ రుసుంను మాఫీ చేసి ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధికి బాటలు వేయడం హర్షణీయం.

– ఆస్మీన్ , ఎంబీఏ, రెండో సంవత్సరం


వర్సిటీకి రోడ్లు వేసిన దృశ్యం

వర్సిటీ అందిస్తున్న కోర్సుల వివరాలు ..

ఉర్దూ యూనివర్సిటీలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులు అందిస్తున్నారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, ఎంబీఏ కోర్సులను వర్సిటీ అందిస్తోంది.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: తిరుపతి కేంద్రంలోని భారత పర్యాటక శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సంయుక్తంగా స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అప్‌లెడ్ న్యూట్రిషియన్‌లో 2023–2024 సంవత్సరానికి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ అధ్యాపకులు ఎన్.శివరామకృష్ణ చౌదరి తెలిపారు. బి.ఎస్.సి(హెచ్ అండ్ హెచ్.ఎ) 3 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్‌లో 45 శాతం పైబడి మార్కులు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. క్రాఫ్ట్ కోర్సు ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరి కోర్సుకు ఎస్.ఎస్.సి పాసైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. సర్టిఫికెట్ కోర్సు ఇన్ ఫుండ్ అండ్ బేవరేజ్ సర్వీస్ కోర్సుకు ఎస్ఎస్‌సి పాసైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అమ్మాయిలు, అబ్బాయిలకు వేరువేరుగా హాస్టల్ సదుపాయం ఉందన్నారు. దరఖాస్తులను జులై 6లోగా తిరుపతిలోని కళాశాలకు పంపాలన్నారు. దరఖాస్తులు www.sihmtpt.org నుంచి దరఖాస్తులను పొందవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9502113163, 9701343846 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

కంబాలపాడు గురుకుల ప్రిన్సిపాల్‌పై వేటు

- కేర్ టేకర్ సస్పెన్షన్.. సెక్యూరిటీ గార్డు తొలగింపు

కృష్ణగిరి: కంబాలపాడు అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణకుమారిని సస్పెండ్ చేసినట్లు డీసీఓ వెంకట్రావ్ తెలిపారు. అలాగే పాఠశాలలో ఉన్న చిల్డ్రన్స్ కేర్ టేకర్ అమ్ములునుతక్షణం సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశామని పేర్కొన్నారు. సెక్యూరిటీ గార్డు రమణమ్మను సర్వీసు నుంచి తొలగించామని చెప్పారు. గురుకుల పాఠశాలలో ఈనెల 14వ తేదీ బుధవారం 8వ తరగతి విద్యార్థిని లుధియా ఆత్మహత్య చేసుకుందని, ఈ ఘటనపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా వేసవి సెలవుల తర్వాత గురుకులంలోని దాదాపు 60 మంది విద్యార్థినులు వచ్చారు. వారి తల్లితండ్రులు ఇళ్లకు తీసుకువెళ్లడంతో గురుకులం ఖాళీ అయ్యింది. సోమవారం నుంచి యథావిధిగా పాఠశాల జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఎస్సార్బీసీ ఉద్యోగి దుర్మరణం


బాలాజీ సింగ్ (ఫైల్)

అవుకు: ఆటో బోల్తా పడిన ప్రమాదంలో బనగానపల్లె ఎస్సార్బీసీ డివిజన్–1లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బొండిలి బాలాజీ సింగ్ (58) దుర్మరణం చెందాడు. అవుకు డివిజన్‌లో పని చేస్తున్న ఇతను వారం క్రితం బదిలీపై బనగానపల్లెకు వెళ్లాడు. అవుకులో ఉన్న లగేజీని తీసుకెళ్లేందుకు శుక్రవారం ఆటోలో వస్తుండగా సమీపంలోని జమ్ములమ్మ ఆలయ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బాలాజీసింగ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా, ఆటోలో ఉన్న మరో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. మృతుడి సొంతూరు ఆత్మకూరు కాగా భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

బొమ్మలసత్రం: నందిపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్ అహమ్మద్ తెలిపిన వివరాల మేరకు.. శనివారం తెల్లవారుజామున కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న నంద్యాల రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయసు దాదాపు 50 ఏళ్లు ఉంటుందని, తెల్లని ఫుల్ హ్యాండ్స్ చొక్కా, లేత ఆకుపచ్చ రంగు ప్యాంట్ ధరించాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

• కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్



మాట్లాడుతున్న కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, చిత్రంలో కలెక్టర్ సృజన, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా సంసద్ ఆదర్శగ్రామీణ యోజన కార్యక్రమం అమలవుతోందని కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవ్‌కుమార్ అన్నారు. ఈ పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ 2014 అక్టోబర్ 11న ప్రారంభించారని చెప్పారు. శుక్రవారం స్థానిక జిల్లాపరిషత్ మినీ సమావేశ భవనంలో సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన అమలుకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీతో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఈ పథకం కింద దత్తత తీసుకున్న ఐదు గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని పథకాలను దత్తత గ్రామాల్లో అమలు చేయడంతో పాటు మౌలిక వసతులను కూడా కల్పించాల్సి ఉందన్నారు. ఆయా గ్రామాల్లోని సమస్యలను జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖలకు చెందిన అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని ఆయన సర్పంచులను కోరారు. కర్నూలు నుంచి బళ్లారి వరకు ఉన్న రోడ్డును ఫోర్‌లైన్ హైవేగా నేషనల్ హైవేస్ అధికారులతో మాట్లాడి కన్వర్షన్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చూపిస్తున్న శ్రద్ధకు అనుగుణంగా జిల్లాకు కేటాయించిన ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్‌పై అవగాహన కల్పించాలన్నారు.

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ సంసద్ ఆదర్శ గ్రామ యోజన కింద ఎంపికైన గ్రామాల్లో అన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతోందన్నారు. అధికారులు క్రమం తప్పకుండా ఈ గ్రామాలను సందర్శించాలన్నారు. విద్య, ఉపాధి మార్గాలను పెంచడం ద్వారా వలసలను పూర్తి స్థాయిలో నివారించవచ్చన్నారు.
- జడ్పీ సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ ఎస్ఏజీవై కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె, తుగ్గలి మండలం రాతన, ఆస్పరి మండలం యాటకల్లు, పెద్దకడుబూరు మండలం దొడ్డిమేకల, కర్నూలు మండలం నిడ్జూరు గ్రామాలను ఎంపిక చేశామన్నారు. ఈ గ్రామాల్లో ఇప్పటివరకు 104 అభివృద్ధి పనులు మంజూరు కాగా 74 పూర్తయ్యాయని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసకుమార్, బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట రుణాలు ఇవ్వండి

- నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోండి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి


మాట్లాడుతున్న భరత్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ శామూన్

నంద్యాల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, అర్హులైన రైతులు, కౌలు రైతులందరికీ సకాలంలో పంట రుణాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్‌కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వారి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు. భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ముమ్మరంగా దాడులు నిర్వహించాలన్నారు. ఉద్యాన శాఖ ద్వారా 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు రైతులకు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీడ్ శాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహించి రైతులకు అవసరమయ్యే నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని కోరారు. 2022 జూలై 8కి సంబంధించిన క్రాఫ్ ఇన్సూరెన్స్ మొత్తాన్ని ముఖ్యమంత్రి త్వరలో విడుదల చేస్తారని తెలిపారు. పశుసంవర్ధక శాఖ ద్వారా ఎద్దులకు బీమా వర్తించే విషయంపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ 12,890 సీసీఆర్‌సీ కార్డుల జారీ లక్ష్యంలో భాగంగా 18 శాతం మాత్రమే పంపిణీ చేశారని, మరోసారి స్పెషల్ క్యాంపెయిన్ ఏర్పాటు చేసి గ్రామ సభలు నిర్వహించి కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు, రసాయనిక ఎరువుల దుకాణాల్లో నామమాత్రపు తనిఖీలు నిర్వహించకుండా సీరియస్‌గా వ్యవహరించి నివేదికలు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారులకు సూచించారు. జీలుగ విత్తనాలు 4,560 క్వింటాళ్లకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆ మేరకు విత్తనాలు సరఫరా చేయాలన్నారు. పంట ఉత్పత్తుల ధరలను వైఎస్సార్ సీఎం యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. డీఏఓ మోహన్ రావు, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జైలు

కర్నూలు: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడిన ఎనిమిది మందికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో సుంకేసుల రోడ్డులోని సంజీవని హాస్పిటల్ దగ్గర గురువారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. తెలంగాణలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ కర్నూలుకు వస్తున్న మందుబాబులను తనిఖీ చేసి మూడు ఆటోలు, 14 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, ఒక ఐచర్ వాహనాన్ని సీజ్ చేశారు. అలాగే రఫీ, కె.సుధాకర్, ఎస్.సుధాకర్, బీకే మహేష్, ఎం.ఎల్లప్ప, ఆర్.మహేంద్ర, పి.మోహన్, ఎ.దేవరాజు తదితరులను శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. దీంతో మందుబాబులను కర్నూలు మండలం పంచలింగాల గ్రామ శివారులోని జిల్లా జైలుకు తరలించారు.

ఈ నెల చివరిలోపు 10,252 భూసార పరీక్షలు

- ఆర్‌బీకేల వారీగా 22 మట్టి నమూనాల సేకరణ



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పెద్ద ఎత్తున భూసార పరీక్షలు నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. 2023–24 సంవత్సరానికి సంబంధించి 52,128 భూసార పరీక్షలు నిర్వహించాలనేది లక్ష్యం. వర్షాలు ఆలస్యం కావడం వల్ల సీజన్ కూడా జాప్యమవుతోంది. అందువల్ల ఈ నెల చివరిలోపు వీలైనన్ని మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహించేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలో 466 రైతుభరోసా కేంద్రాలు ఉన్నాయి. ప్రతి ఆర్‌బీకే పరిధిలో 22 మట్టి నమూనాలు చొప్పున జిల్లా మొత్తం 10,252 నమూనాలను సేకరించి ఎమ్మిగనూరులోని భూసార పరీక్ష కేంద్రానికి పంపాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. మిగిలిన భూసార పరీక్షలను మార్చి నెల చివరిలోపు పూర్తి చేయాలని డీఏఓ ఆదేశించారు.